

సాక్షి
బాపట్ల

రేపటికి
ముందడుగు



శుక్రవారం । 8 । మార్చి । 2024

మహిళలకే అగ్రతాంబూలం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అన్నిరంగాల్లో మహిళలే అగ్రతాంబూలం ఇస్తున్నారు. రాష్ట్రంలో ఏకంగా ఎన్నడూ లేని విధంగా 32లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందజేయటంతో పాటు, పూర్తిస్థాయిలో వారికే హక్కులు కల్పించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మహిళలే మహారాణులు అనేది సుస్పష్టం. మహిళా సాధికారిత సీఎం వైఎస్ జగనన్న ద్వారానే సాధ్యపడుతుంది. గత ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని విస్మరించింది. సీఎం వైఎస్ జగన్ మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చారు. వైఎస్సార్ చేయూత ద్వారా మహిళల ఆత్మగౌరవాన్ని పెంచారు. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, డ్వాక్రా రుణమాఫీ వంటి ఎన్నో పథకాలను మహిళలకు చేరువ చేశారు. సీఎం వైఎస్ జగనన్న మహిళల పక్షపాతి అనేది సుస్పష్టం.

అన్నిరంగాల్లో అతివలకే అగ్రపీఠం

జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో మహిళా సాధికారత పెరిగింది. కుటుంబాన్ని చక్కదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణిస్తున్నారు. మానవాళి మనుగడను ముందుకు తీసుకెళ్లడంలో ఎంతో కీలకమైన మహిళలు పురుషులతో సమానంగా విద్య, వైద్య, క్రీడా, రాజకీయ రంగాల్లో పైచేయి సాధిస్తున్నారు. రాష్ట్రంలో రాజకీయంగా 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను గౌరవప్రదమైన స్థానంలో నిలిపారు. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో అట్టడుగువర్గాలకు చెందిన అతివలు రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో రాణిస్తున్నారు. సమాజంలో మహిళా చైతన్యం పెరగడంతో పాటు బాలికా విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

మహిళా సాధికారతకు పెద్దపీట

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



తాడికొండ: మహిళా సాధికారతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రతి పథకాన్ని మహిళలకు అందజేస్తూ ఇళ్ల స్థలా లు, పక్కా ఇళ్ల నిర్మాణం, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పలు పథకాలను మహిళలకు ఇచ్చి వారిని ఆర్థికంగా లక్షాధికారులను చేశారు. మహిళల భద్రత కోసం దిశ చట్టాన్ని అమలు చేసి ఆ చట్టాలను సక్రమంగా అమలు చేసేందుకు ప్రత్యేక పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఏపీకి మొట్టమొదటి హోం మంత్రిగా ఓ దళిత మహిళనైన నన్ను జగనన్న నియమించారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో ముందంజలో నడుస్తున్నారనేందుకు ఏపీని ఉదాహరణగా తీసుకోవచ్చు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ పరిశీలకులుగా కసుకుర్తి ఆదెన్న

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ చీరాల నియోజకవర్గ పరిశీలకులుగా కసుకుర్తి ఆదెన్నను నియమిస్తూ గురువారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఈమేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇకపై చీరాల నియోజకవర్గ పార్టీ పరిశీలకులుగా కసుకుర్తి ఆదెన్న వ్యవహరించనున్నారు.

అలరించిన అటవీశాఖ స్టాళ్లు

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి పర్వదినాన త్రికోటేశ్వరుని దర్శనానికి వచ్చే యాత్రికుల కోసం అటవీ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఘాట్‌రోడ్డులోని ఎకో పార్క్ వద్ద వివిధ రకాల పుష్పాలతో ఏర్పాటుచేసిన స్వాగత స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.





విద్యుద్దీపాల అలంకరణతో కళకళలాడుతున్న పెదకాకాని శివాలయం



విద్యుత్ వెలుగుల్లో కోటప్పకొండ ఆలయ గాలిగోపురం



చేబ్రోలు క్వారీ తిరునాళ్లకు సిద్ధమైన దేవాలయం

ఏ పూలు తేవాలి నీ పూజకు..

మహాశివరాత్రి పర్వదినం భక్తులకు ముక్తిదాయకం. అందునా శైవక్షేత్రాల్లో శివయ్య దర్శనం కోసం భక్తులు బారులుతీరి కనపడతారు. ఎందుకంటే ఈశ్వరుడిని అడిగిన తరువాత ఇక మరొకటి ఎవరినీ అడగాల్సిన అవసరం రానివ్వడన్న భావనతో. 'శంకరా అంటే నాకు చక్కెర లెక్కనుంటాది' అని భక్తిగా అర్చించినా, 'చేతులారంగ శివుని పూజింపడేని, నోరునొవ్వంగ హరికీర్తి నుడవడేని' అని సేవించినా ఇట్టే అనుగ్రహమిచ్చే స్వామి సదాశివుడు. ఇవాళ ఆ స్వామి లింగోద్భవ వేళలో దర్శనమిచ్చిన పర్వదినం. 'తలమీద చెంబుడు నీళ్లు పోసి శంకరా!' అని ఆర్తిగా పిలిస్తే కరిగిపోయే తత్వం ఆ సదాశివుడిది. 'ఇందుగలదందు లేదని' అన్నట్లుగా స్వామి ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ప్రతిష్ఠతుడై భక్తులను అనుగ్రహిస్తూ పూజలందుకుంటున్నాడు. అందునా ప్రధానంగా త్రికూటాద్రిపై (కోటప్పకొండ) మేధా దక్షిణామూర్తిగా (కోటయ్య స్వామి) కొలువుదీరి భక్తులను విశేషంగా అనుగ్రహిస్తున్నారు. ఆయనకు ప్రభ కట్టుకుని వెళ్లి దర్శించుకుంటే కోరిన వరాలనిస్తాడని ప్రతీతి. ఇక కృష్ణా తీరంలో (అమరావతి) కొలువై ఉన్న అమరేశ్వరుడి దర్శనం ముక్తిదాయకంగా చెబుతారు. పెదకాకాని , గోవాడ, చేజర్ల, క్వారీ, సత్రశాల వంటి ప్రాంతాల్లో స్వామి వేర్వేరు పేర్లతో కొలువుదీరి భక్తులను అనుగ్రహిస్తున్నారు. – సాక్షి, నెట్‌వర్క్

అతివలకు అగ్ర తాంబూలం



రేపటికి
ముందడుగు

- మహిళా సాధికారతకు సీఎం జగన్ సర్కార్ కృషి
- మహిళా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట
- సంక్షేమ పథకాల అమలులో అగ్రభాగం మహిళలకే
- సర్పంచ్ మొదలు మంత్రి వరకు రాజకీయ ప్రాధాన్యం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

బాపట్లటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తోంది. అన్ని రంగాల్లో కల్పించిన 50 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థలు, పంచాయతీల్లో ఆరంగేట్రం చేసిన మహిళలు ప్రజా సేవలో తామేమి తీసిపోమని సత్తా చాటుతున్నారు. వార్డుమెంబర్లు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, పురపాలక చైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లు, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎమ్మెల్యే, మంత్రులుగా ప్రజా సేవలో తమదైన ముద్ర వేస్తున్నారు. జిల్లాలో 459 గ్రామ పంచాయతీలు, 25 జెడ్పీటీసీ స్థానాలతోపాటు ఎంపీటీసీ స్థానాలలో సగం స్థానాలు మహిళలకు రిజర్వ్ చేసి వారిని ప్రజాప్రతినిధులుగా ప్రభుత్వం ఎంపిక చేసింది.

చదువుతోనే ఉన్నతస్థాయికి ...



మహిళలు నేడు విద్యతోపాటు అన్ని రంగాల్లో ముందుకు సాగుతుండటం సంతోషించదగ్గ పరిణామం. ఇది మరింతగా పెరగాలి. మహిళలు అధైర్యాన్ని పారదోలి ధైర్యంతో ముందుకు సాగాలి. మంచి భవిష్యత్తు కోసం ఉన్నత లక్ష్యాలతో ముందడుగు వేయాలి. తొలుత చదువుపై దృష్టి పెట్టాలి.

– బి.కృష్ణవేణి,
వరి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త

జగనన్నతోనే నూరుశాతం సాధికారత



మహిళా సాధికారత అనే మాటలు గతంలో వినడం తప్ప ఆచరణలో అమలు కాలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో మహిళా సాధికారిత నూటికి నూరుశాతం అమలవుతుంది. మహిళా సంక్షేమ పరంగా, రాజకీయంగా చైతన్యవంతులయ్యారు.

– పిన్నిబోయిన ఎస్తేరు రాణి,
జడ్పీటీసీ సభ్యురాలు, బాపట్ల మండలం

స్త్రీ, పురుషులు సమానమే..



సృష్టిలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమే. అసలు స్త్రీ పురుషుల్లో ఒకరు ఎక్కువని, ఒకరు తక్కువని ఎందుకు అనుకోవాలి? స్త్రీలు పురుషుల్ని ఆదర్శంగా తీసుకొని వాళ్లతో సమానం అవ్వాలని అనుకుంటారని ఎందుకు అనుకోవాలి?

– జి.లక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జరిగింది. ముందుగా వివిధ ఆటపాటలలో పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. తదుపరి మహిళా అధికారులను ఘనంగా సన్మానించారు.బాపట్ల, రేపల్లె ఆర్డీఓలు జి.రవీందర్, హేలా షారోన్, మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జె.రాజదిబోరా,డీఐపీఆర్ఓ సహాయ సంచాలకురాలు కె.సుభాషిణి, ఏపీఎంఐపీ పీడీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



మహిళలను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ఎన్నికలల్లో మీడియా బాధ్యత కీలకం..

బాపట్ల: ఎన్నికలలో మీడియాకు కీలకమైన బాధ్యత ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా స్థాయి బ్యూరో జర్నలిస్టులకు గురువారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శకతతో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి మీడియా తమ వంతు సహకరించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధన అనుసరించి ఎన్నికల ప్రక్రియ సాగుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ చెప్పారు. పోలింగ్ రోజున ధ్రువీకరణ పొందిన మీడియా వారికి మాత్రమే పోలింగ్ కేంద్రాల పరిశీలనకు అనుమతులిస్తామని ఆయన తెలిపారు. ఏపీఎంఐపీ పీడీ వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పి.గుడిపాడులోని సిద్ధం సభా ప్రాంగణంలో సిద్ధం టీషర్టులను ఆవిష్కరిస్తున్న ఎంపీలు విజయసాయిరెడ్డి, నందిగం సురేష్, మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, గుంటూరు తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా తదితరులు

- మేదరమెట్ల

'సిద్ధం' సభకు పటిష్ట భద్రత

- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్
- సభా ప్రాంగణం పరిశీలన
- పార్కింగ్, ట్రాఫిక్ డైవర్షన్‌లపై సిబ్బందికి సూచనలు

మేదరమెట్ల: ఈ నెల 10వ తేదీన కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు జాతీయ రహదారి సమీపంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే సిద్ధం సభకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. గురువారం పోలీసు అధికారులతో సభా ప్రాంగణాన్ని కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే బహిరంగ సభకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు అన్ని రకాల చర్యలు చేపట్టారన్నారు. సభకు వచ్చే వాహనాలు నిలుపుకొనేందుకు మొత్తం 28 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సభా ప్రాంగణం తోపాటు హెలిప్యాడ్ ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకుంటామన్నారు. ప్రధాన రహదారి నుంచి ట్రాఫిక్‌ను దారిమళ్లించే ప్రతి చోటా అందరికీ అర్థమయ్యే రీతిలో వాహనదారులకు తగు సూచనల కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని, అలాగే ట్రాఫిక్ దారి మళ్లింపు ప్రాంతాలను సెక్టారులుగా విభజించి ప్రతి సెక్టారుకు పోలీసు అధికారులను నియమిస్తామన్నారు. ప్రాంగణంలో ప్రవేశించే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయడానికి డీఎఫ్ఎండీ మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట కమ్యూనికేషన్ ఎస్పీ రాజశ్రీ,, చీరాల డీఎస్పీ బి.ప్రసాద్, బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, క్రైమ్ విభాగం డీఎస్పీ జగదీష్‌నాయక్, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, కమ్యూనికేషన్ డీఎస్పీ స్వామి బాబు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, స్థానిక పోలీసు అధికారులు ఉన్నారు.



సభా ప్రాంగణంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

యార్డులో 1,44,649 బస్తాల మిర్చి అమ్మకాలు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,25,293 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,44,649 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 89,789 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- జిల్లాలో 88,055 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.165.10 కోట్లు జమ
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కు అందజేత

బాపట్ల: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తూ... పేదల జీవితాలలో వెలుగులు నింపుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని అనకాపల్లి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం బటన్ నొక్కి ప్రారంభించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలోనూ ఈ కార్యక్రమాన్ని స్థానిక స్పందన సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి కలిసి జిల్లాలోని లబ్ధిదారులైన మహిళలకు చెక్కు అందజేశారు. మహిళల సాధికారత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని జిల్లా కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన 88,055 మంది మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారన్నారు. నాల్గో విడత కింద జిల్లాకు రూ.165.10 కోట్లు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ విశ్వసనీయతకు మారుపేరు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దఎత్తున చేయూతనందిస్తుందన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ సీహెచ్ కృష్ణ, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి

457 కిలోల గంజాయి స్వాధీనం

- బాపట్లలో పట్టుకున్న సెబ్ పోలీసులు
- పట్టుకున్న గంజాయి విలువ రూ.కోటిపైనే..
- రెండు వాహనాలు సీజ్.. ముగ్గురు వ్యక్తుల అరెస్ట్

బాపట్లటౌన్: అంతర్రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేసే ముఠాను బాపట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 457 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం సాయంత్రం బాపట్లలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రి నుంచి చెన్నైకు గంజాయి లోడుతో వెళ్తున్న మినీ లారీని బాపట్ల శివారు మరుప్రోలువారిపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. సెక్యూరిటీగా ముందు, వెనుక ప్రయాణిస్తున్న కారులను సైతం అదుపులోకి తీసుకున్నారు. జిల్లా సెబ్ అధికారి నరసింహారావు మాట్లాడుతూ తణుకుకు చెందిన జానకి రాముడు, గుడిపాటి హరిబాబు, తమిళనాడు రాష్ట్రానికి చెందిన చిన్నమత్తి దేవరాసు అనే వ్యక్తులు రాజమండ్రి నుంచి చైన్నెకు గంజాయి తరలిస్తున్నారని సమాచారం మేరకు బాపట్ల సీఐ వెంకటేశ్వరరావు, చీరాల సీఐ కర్ణలు తమ సిబ్బందితో బాపట్ల రూరల్ మారుప్రోలు వారిపాలెం వద్ద జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గంజాయి తరలిస్తున్న వాహనానికి పైలెట్‌గా ఉన్న కారును తనిఖీ చేస్తుండగా వెనుక వస్తున్న గంజాయి లారీ డ్రైవర్ అనుమానాస్పదంగా కనిపించడంతో రెండు వాహనాలను నిలుపుదల చేసి తనిఖీ చేశారన్నారు. గంజాయి తరలిస్తున్న లారీలో డ్రైవర్‌గా జానకిరాముడు, పక్క సీటులో దేవరాసు ఉన్నారన్నారు. ముందు వెళ్తున్న కారులో గుడిపాటి హరిబాబును కూడా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు. లారీలో 17 బస్తాల్లో 457 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకుని, రెండు వాహనాలు సీజ్ చేయడంతో పాటు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన దేవరాసు రాజమండ్రి కేంద్రంగా గంజాయి కొనుగోలు చేసి తమిళనాడు తీసుకువెళ్తున్నారన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలతో సెబ్ పోలీసులు

క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో బయటపడ్డ లుకలుకలు

మాజీ ఎంపీ జేడీ శీలంపై స్థానికుల ఆగ్రహం

చీరాలరూరల్: చీరాల కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు బయటపడ్డాయి. మాజీ ఎంపీ జేడీ శీలంపై స్థానిక పార్టీ ఇన్‌చార్జి దేవరపల్లి రంగారావు, ఇతర నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ పెత్తనం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయమై గురువారం రంగారావు ఆధ్వర్యంలో నాయకులు సమావేశం నిర్వహించారు. చీరాలలో ఇన్‌చార్జికి సమాచారం లేకుండా నేను ఎంపీ అభ్యర్థినని జేడీ శీలం మీటింగులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా పని చేసిన శీలం మతిలేకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పదేళ్లుగా తాను పార్టీని అభివృద్ధి పథంలో పయనింపచేస్తుంటే ఆయన ఇప్పుడు చీరాల వచ్చి గ్రూపులు నడపడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. బాపట్ల ఎంపీ అభ్యర్థిగా స్థానికులకు టికెట్ ఇస్తే గెలుస్తారని చెప్పారు. అలా కాదని గ్రూపులు ఏర్పాటు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు బండ్లమూడి విజయ్‌కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి మెరిగ రమేష్, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మస్తాన్ వలి, జిల్లా ఉపాధ్యక్షుడు జూటూరి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తిని గుర్తించిన దేశాలు ముందంజ

ఏడీఏ డాక్టర్ డి.ప్రమీలరాణి


అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ డి.ప్రమీలరాణిని సన్మానిస్తున్న డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు

బాపట్ల: మహిళా శక్తిని గుర్తించిన దేశాలు మాత్రమే ముందంజలో ఉన్నాయని వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(ఏడీఏ) డాక్టర్ డి.ప్రమీలరాణి పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా వ్యవసాయ కళాశాలలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో డాక్టర్ ప్రమీలరాణి మాట్లాడారు. 20వ శతాబ్దంలో ఉత్తర అమెరికా, ఐరోపాలో మహిళా కార్మిక ఉద్యమాల నుంచి ఉద్భవించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నేడు ప్రపంచమంతా ఒక పండుగలా జరుపుకోవడం మహిళలు సాధించిన విజయమని అన్నారు. ప్రపంచ దేశాల్లో 128వ స్థానంలో ఉన్న భారతదేశం అగ్రగామి దేశంగా వెలుగొందాలంటే స్త్రీ శక్తిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ మూర్తి ఉంటుందన్న వాస్తవాన్ని గ్రహించాలని అన్నారు. మన పూర్వీకులు కూడా మహిళలను గౌరవించారని అన్నారు. నేడు అన్ని రంగాల్లోనూ పురుషుడితో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ చైర్మన్ డాక్టర్ వి.ప్రసన్నకుమారి మాట్లాడుతూ విద్యార్థినుల తొలి గురువు తల్లి అని, వారి ఆలోచనలు స్వచ్ఛతతో కూడి ఉండాలన్నారు. కళాశాలలో విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్. ప్రవంతిరెడ్డి మాట్లాడుతూ తాను గ్రూప్ వన్ అధికారి కావడం తన కల అనీ, దాన్ని సాధించడానికి చేసిన కృషిలో కళాశాల అధ్యాపకులు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. స్త్రీకి స్త్రీ శత్రువు కాదు అని రుజువు చేయాలని, మహిళలు నాయకత్వస్థాయికి ఎదగాలని డాక్టర్ జాగర్లమూడి లక్ష్మి పిలుపునివ్వగా, స్త్రీలకు బాధ్యత ఎక్కువని, స్త్రీకి స్వాతంత్ర్యం ఇవ్వకూడదని భావన నుంచి స్త్రీలు పూజించబడిన చోటే దేవతలు ఉంటారనే స్థితికి చేరుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ చిరంజీవి, డాక్టర్ పి.మధుమతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించుకోవటం మన సంప్రదాయం

మహిళలను గౌరవించుకోవటం మన సంప్రదాయమని ఎంపీడీఓ పర్రె విజయశేఖర్ పేర్కొన్నారు. బాపట్ల ఎంపీడీఓ కార్యాలయంలో మహిళల దినోత్సవ వేడుకలు గురువారం జరిగాయి. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన ఎస్తేరురాణి, ఈవోపీఆర్డీ పులి శరత్ బాబు, ఏఓ రజని, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ఉంటాం..

- ముస్లింలతో ఆత్మీయ సమావేశం
- ఎమ్మెల్యే కరణం బలరాం, సమన్వయకర్త వెంకటేష్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వేదికపై సమన్వయకర్త వెంకటేష్

చీరాల అర్బన్: ముస్లింలకు వైఎస్సార్ సీపీ తరపున మా నుంచి సహాయ సహకారాలు అందిస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎల్‌బీఎస్ నగర్‌లోని షాదీఖానాలో ముస్లింల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌లు హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. మసీదుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పరంగా ముస్లింలకు అందాల్సిన అన్ని సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. షాదీ తోఫా, ఇమాంలకు గౌరవ వేతనాలు అందించారన్నారు. అందరికి తాను అండగా ఉంటానన్నారు.

ముస్లింల అభివృద్ధికి సహాయ సహకారాలు..

సమన్వయకర్త కరణం వెంకటేష్ మాట్లాడుతూ ముస్లింలకు అవసరమైన మౌలిక వసతులు, వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముస్లింల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కులమతాలకు అతీతంగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా ఈ ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. అలానే పట్టణంలోని పీర్ల చావిడిని అభివృద్ధి చేయాలని పలువురు ఆయనను కోరారు. మసీదు సెంటర్‌లో అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేసి చరిత్రలో జగనన్న ప్రభుత్వం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కొద్దిరోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మళ్లీ సీఎంగా జగనన్నను గెలిపించుకునేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, షేక్ సలీమ్, షేక్ మహిమూద్, షేక్ కబీర్, షేక్ అల్లాభక్ష్, అబ్దుల్ రహీమ్, షేక్ నాగూర్‌బాషా, షేక్ జవాబ్, షేక్ సుభాని, పఠాన్ రహమతుల్లా, షేక్ సత్తార్, షేక్ బుడే, షేక్ ఖాదర్, షేక్ జిలాని, షేక్ షరీఫ్, సయ్యద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పథకాలే విజయానికి సోపానాలు

- కొప్పరపాడులో సచివాలయ ప్రారంభం
- రచ్చబండ కార్యక్రమంలో సమన్వయకర్త చిన హనిమిరెడ్డి


కొప్పరపాడులో సచివాలయం ప్రారంభిస్తున్న చిన హనిమిరెడ్డి

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కులమతాలకతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలే విజయానికి సోపానాలని అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని కొప్పరపాడు గ్రామంలో రూ.43 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించి రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాలోనే ప్రజలకు సపరిపాలన అందిచేందుకే సచివాలయ, రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేసి జగనన్న చరిత్ర సృష్టించారన్నారు. పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో అంతిమ విజయంతో రెండోసారి సీఎంగా జగనన్న అధికారాన్ని చేపట్టడం ఖాయమన్నారు. తాను మూడు నెలలుగా నియోజకవర్గంలో గ్రామాల వారీగా తిరుగుతున్నానని ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుడిగా ఆరాధిస్తున్నారని చెప్పారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మీ అందరికి అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. తోడుదొంగలు ఒక్కటైన తమ విజయాన్ని అపలేరని, అద్దంకిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు చిన హనిమిరెడ్డికి గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ముద్దపాటి శంకర్, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, పార్టీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు టి.నరేష్, పార్టీ మండల ఇన్‌చార్జి డి.బ్రహరెడ్డి, స్థానిక నేతలు, చింతల శ్రీనివాసరావు, మక్కెన వెంకటరామారావు, ఎం దానా నాయక్, బి.గురవయ్య, కుంచపు ఆదినారాయణ, బుర్రి ఆదెయ్య, కుందుర్తి అశోక్, ఏల్చూరి రవీంద్ర వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీరాజ్ ఏఈ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోలు రాధ ఎడ్ల విజేత బాపట్ల

ముగిసిన రాష్ట్రస్థాయి పోలు రాధ ఎడ్ల పోటీలు


ఎడ్ల పోటీలో విజేతలకు బహుమతులందిస్తున్న నిర్వాహకులు

చినగంజాం: శివరాత్రి పండుగను పురస్కరించుకొని సోపిరాల రామకోటేశ్వరాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి నాటుబండి పోలు రాధ ఎడ్లపోటీలు గురువారం వేకువజామున ముగిశాయి. పోటీలలో బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పొగడదండవారిపాలెం గ్రామానికి చెందిన కుంచాల వేదాంతరెడ్డి ఎడ్ల జత నిర్ణీత వ్యవధిలో 3,254 అడుగులు లాగి ప్రథమ స్థానం రాగా ఆలయ కమిటీ చైర్మన్ టీఎస్సార్ ఆంజనేయులు రూ.25 వేలు, వేటపాలేనికి చెందిన బల్లేపల్లి కోటేశ్వరరావుకు చెందిన ఎడ్ల జత 3250 అడుగులు లాగి ద్వితీయ స్థానం సాధించాయి. ఎంపీటీసీ ఆమంచి వెంకట సుబ్బారావు రూ.20 వేలు, బాపట్ల మండలం కొత్తపాలెంనకు చెందిన కావూరి వెంకటేశ్వరరెడ్డి ఎడ్ల జత 3,155 అడుగులు లాగి మూడోస్థానం రాగా టీ రాఘవయ్య, జ్ఞాపకార్థం వారి కుమార్తె పద్మజ రూ.15 వేలు, చినగంజాం మండలం కొత్తగొల్లపాలేనికి చెందిన గోగినేని అశోక్ ఎడ్ల జత 3091 అడుగులు లాగి నాలుగో స్థానం రాగా పర్వతరెడ్డి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రంగనాథ్ రూ.10 వేలు, సోపిరాలకు చెందిన చెరుకూరి భాస్కరరావు ఎడ్ల జత 3000 అడుగులు లాగి 5వ స్థానం రాగా నరహరి శ్రీను రూ.8 వేలు, ఈపూరుపాలేనికి చెందిన జీ పూర్ణచంద్రరావు ఎడ్ల జత 2,998 అడుగులు లాగి ఆరో స్థానం రాగా కుర్రి వెంకటేశ్వర్లు కుమారులు రూ.6 వేలు, ఈపూరుపాలేనికి చెందిన బాల వెంకటేశ్వర్లు ఎడ్ల జత 2,990 అడుగులు లాగి 7వ స్థానంలో నిలువగా చెరుకూరి నాగేశ్వరరావు రూ.5 వేలు, బాపట్ల మండలం ఆసోదివారిపాలెంనకు చెందిన కే చంద్రయ్య ఎడ్ల జత 2919 అడుగులు లాగి 8వ స్థానం రాగా చెరుకూరి వీరయ్య, సుబ్బరావమ్మల కుమారుడు భాస్కరరావు రూ.4 వేలు, 9వ స్థానంలో చినగంజాం మండలం కడవకుదురుకు చెందిన కే మహేశ్వరి ఎడ్ల జత 2819 అడుగులు దూరం లాగి విజేతలుగా నిలిచారు. వారికి గోగినేని నాగరాజు రూ.3 వేలు నగదు బహుమతులుగా అందజేశారు.

సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

- రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి
- పర్చూరులో సిద్ధం సన్నాహక సమావేశం


మాట్లాడుతున్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పక్కన సమన్వయకర్త యడం బాలాజీ

పర్చూరు (చినగంజాం): రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు రాబోయే ఐదేళ్లలో అమలు కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిందేనని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి అన్నారు. గురువారం పర్చూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన సిద్ధం సన్నాహక సభ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ కార్యాలయానికి తొలిసారిగా విచ్చేసిన ఆయనను పార్టీ సమన్వయకర్త యడం బాలాజీ సాదరంగా ఆహ్వానించారు. ఎంపీ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి పెద్దపీట వేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. సిద్ధం సభ అనంతరం సభా ప్రాంగణం నుంచి పర్చూరు ఎన్నికల శంఖారావాన్ని పూరించాలన్నారు. కార్యకర్తలకు తాను అందుబాటులో ఉంటానని నియోజకవర్గం నుంచి వేలాదిగా సభకు తరలి రావాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో యడం బాలాజీ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, నాడు-నేడు బడులు రావాలన్నా మళ్లీ జగన్ సీఎం కావాలన్నారు. సిద్ధం సభను అందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర మార్కెటింగ్ సహకార ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు కల్లం సాయి, కన్వీనర్ కఠారి అప్పారావు, బండారు ప్రభాకరరావు, ఎం.నాగేశ్వరరెడ్డి, పఠాన్ కాలేషా, నీరుకట్టు వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండలో స్కౌట్స్, పోలీసులకు భోజనాలు ఏర్పాటు

తులసి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్


కోటప్పకొండలో స్కౌట్స్‌కు భోజనాలు వడ్డిస్తున్న యోగీష్

నరసరావుపేట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండకు వచ్చే భక్తుల భద్రతా పర్యవేక్షణ నిమిత్తం సేవా శిబిరం క్యాంపునకు విచ్చేసిన 500 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బందికి, 3వేలమంది పోలీస్ సిబ్బందికి తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అల్పాహార, భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. శిబిరాన్ని తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ ప్రారంభించి మాట్లాడారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు యోగీష్ చంద్ర మెమెంటోలు అందజేశారు. స్కౌట్స్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, క్యాంపు కన్వీనర్ రాంబాబు, క్యాంపు ఆఫీసర్ శ్రీనివాసరావు క్యాంప్ సహాయకులు వి.వి. హరనాథ్, ఎం.కృష్ణయ్య, షేక్ దావూద్ పాల్గొన్నారు.

ఘనంగా మొదలైన సాగర్‌మాత మహోత్సవాలు


దివ్యబలి పూజా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గురుశ్రీ జోసఫ్

విజయపురిసౌత్: శాంతి, సమాధానం, ప్రేమ, కరుణ, వాత్సల్యాలను భక్తులకు ప్రసాదించాలని గోరంట్ల గురుశ్రీ గోపు జోసఫ్ ప్రార్థించారు. మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో గురువారం ప్రారంభమైన సాగర్‌మాత మహోత్సవాలను పురస్కరించుకొని జరిగిన సమష్టి దివ్యబలిపూజ కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. పరిశుద్ధాత్మ అయిన ఏసుక్రీస్తుకు జన్మను ప్రసాదించిన సాగర్‌మాత(మరియమ్మ) ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని, ఆ తల్లిని భక్తి విశ్వాసాలతో పూజిస్తే కోరికలతోపాటు పాపాలు సైతం చెరిగిపోతాయని ఉద్బోధించారు. పరిపూర్ణమైన హృదయంతో, జ్ఞానంతో, వివేకంతో ఏసుక్రీస్తును ప్రార్థించాలని కోరారు. మహోత్సవాల సందర్భంగా ఆలయాలను, జపమాల క్షేత్రాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 5.30గంటలకు సాగర్‌మాత విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్‌చే, 6.30గంటలకు గురుశ్రీ జోసఫ్ తంబి అన్నెంచే దివ్యబలిపూజ, 10గంటలకు గోరంట్ల గురుశ్రీ గోపు జోసఫ్‌చే జపమాల, స్తుతి ఆరాధన, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం, 2గంటలకు గురుశ్రీ గోపు జోసఫ్‌చే వాక్య పరిచర్య, స్వస్థత ప్రార్థనలు, 5.30 గంటలకు గురుశ్రీ అల్లం చిన్న శౌరెడ్డిచే దివ్యబలిపూజ, వాక్య పరిచర్య, 7.30గంటలకు కొవ్వొత్తులతో తేరు ప్రదక్షిణ, రాత్రి 8గంటలకు సాగర్‌మాత కళాకారుల బృందంచే సంసోను-డెలీల బుర్రకథ, రాత్రి 9గంటలకు రక్తబలి బైబిల్ నాటకం కార్యక్రమాలు నిర్వహించారు.

భారీగా తరలివచ్చిన భక్తులు

సాగర్‌మాత మహోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో విజయపురిసౌత్ కళకళలాడింది. స్థానిక లాంచీస్టేషన్ సెంటర్ నుంచి సాగర్‌మాత దేవాలయం వరకు రోడ్డుకు ఇరువైపుల తినుబండారాల కేంద్రాలు, ఫ్యాన్సీషాపులు, వివిధ రకాలైన ఆటబొమ్మల షాపులు వెలిశాయి.

జిల్లాలో ఆరుగురు విద్యార్థులు డిబార్

సత్తెనపల్లి: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుపడ్డారు. గురువారం సీనియర్ ఇంటర్మీడియట్ గణితం-2 పరీక్షలో చిలకలూరిపేట మోడరన్ జూనియర్ కళాశాలకు చెందిన ఒకరు, నూజెండ్ల మండలం ఉప్పలపాడు ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌జేసీలో ఒకేషనల్‌కు సంబంధించిన ఐదుగురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు పల్నాడు జిల్లా డీవీఈవో నీలావతిదేవి తెలిపారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ కలిపి 14,322 మంది హాజరు కావాల్సి ఉండగా 13,760 మంది హాజరయ్యారు. 556 మంది గైర్హాజరయ్యారు.

లారీని ఢీకొని డ్రైవర్ మృతి

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ఆగి ఉన్న లారీని మిర్చిలోడుతో వస్తున్న మరోలారీ ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం బెంగుళూరు నుంచి విజయవాడ వెళుతున్న లారీ మండలంలోని నుదురుపాడు గ్రామ శివారులో ఆగి ఉంది. నంద్యాల నుంచి మిర్చిలోడు తీసుకొని గుంటూరు వెళ్తున్న మరోలారీ ఆగిఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో నంద్యాల జిల్లా బుజునూరుకు చెందిన మిర్చిలోడు లారీ డ్రైవర్ సుబ్బారావు (47) అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా లారీలోని మరో యువకుడు పవన్‌కు తీవ్రగాయాలయ్యాయి.